క్లుప్తంగా

విరాళం అందజేత



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని అమ్మపల్లికి అనుబంధ గ్రామమైన కావలి గుడిసెల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటు చేయడానికి స్థానిక ఎంపీపీ మేఘారెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం అడిగిన వెంటనే స్పందించి అందజేసిన మేఘారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ నారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, బాలు, శ్రీరాములు, శ్రీను, దర్శన్, మారెన్న, నాగన్న, రాజు తదితరులు ఉన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం



గోపాల్‌పేట: తమతో పాటు పదో తరగతి చదివిన స్నేహితుడు అనారోగ్యానికి గురికావడంతో చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే గోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 సంవత్సరంలో పదో తరగతి చదివిన పొలికెపాడు గ్రామానికి చెందిన గౌస్‌పాష ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి స్నేహితులు అందరూ కలిసి ఆదివారం బాధితుడికి రూ.50 వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన స్నేహితుడికి భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బంది ఎదురైనా అండగా ఉంటామని వారి కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజు, మీట్యానాయక్, నరేష్, వెంకటేష్, గిరిధర్‌గౌడ్, బాల్‌రాజు ఉన్నారు.

కళాకారుడికి పురస్కారం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన కళాకారుడు మీసాల రాముకు హన్మకొండ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నంది అవార్డును బహూకరించారు. తెలంగాణ ఉద్యమంతో పాటు వివిధ సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు మీసాల రాము ఎన్నో కళా ప్రదర్శనలను ఇచ్చి పలువురిచే ప్రశంసలు అందుకున్నారు. ఉద్యమ కళాకారులు వెంకన్న, దరువు ఎల్లన్న, ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న చేతుల మీదుగా ఇట్టి అవార్డును రాము అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతను పలువురు అభినందించారు.

పరిసరాల స్వచ్ఛతే ముఖ్యం



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మత్స్య కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పరిసరాల స్వచ్ఛతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో చెరువు, బస్టాండ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు ప్లాస్టిక్, వ్యర్థాలు, బట్టలు, సీసాలు, చెత్తను తొలగించారు. అలాగే స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కొల్లాపూర్: యోగా ద్వారానే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని పతంజలి యోగా శిక్షకులు అలువాల అర్జున్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలోని ముదిరాజ్ సంఘ భవనంలో యోగా శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు పలు యోగా ఆసనాలను వేసి చూపించారు. అలాగే యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఆయనను ముదిరాజ్ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంతోమందికి యోగా ద్వారా ఆరోగ్యాన్ని అందిస్తున్నారని, ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు హరిప్రసాద్‌నాయుడు, తూర్పు కుమారస్వామి, వేములవాడ రాజేష్, నీరజ, రాజేశ్వరీ ఉపాధ్యాయులు నారాయణ, బషీర్, శీనయ్య, చెన్నయ్య తదితరులున్నారు.



వరికి తెగుళ్ల బెడద



కమాలోద్దీన్‌పూర్‌లో ఎదగని వరి పంట

- ఎర్ర బారి ఎదగని పైరు
- ఆందోళనలో అన్నదాతలు
- మండలంలో 8,500 ఎకరాల్లో యాసంగి వరి సాగు



పర్వతాపురంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లయ్య

ఖిల్లాఘనపురం: సాగునీరు పుష్కలంగా ఉండటంతో ఎంతో ఆశతో వరి పంటలు సాగు చేసుకున్న రైతులను ఆదిలోనే తెగుళ్లు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో పాటుగా కేఎల్ఐ సాగునీరు మండలంలోని పెద్ద వాగులో, కాల్వల ద్వారా పారుతుండటంతో రైతులు ఆరుతడి పంటల పండించకుండా వరి సాగు చేశారు. వరి పంట నాటి నెల రోజులు కావస్తున్నా ఎదగక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏం చేయాలో పాలుపోక పురుగు మందుల దుకాణాలు, వ్యవసాయ అధికారుల చుట్టు తిరుగుతున్నారు. 1010రకం వరి పంటలపై ఈ ప్రభావం మరింత ఎక్కుగా ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

పెరిగిన సాగు

మండలంలో ఈఏడాది యాసంగిలో 8,500 ఎకరాల్లో వరి పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గతేడాది యాసంగిలో 7వేల ఎకరాల్లో వరి నాటగా 2,800 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. గతేడాది వరి వేయొద్దని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ ఏడాది ఎలాంటి ఆంక్షలు విధించకపోవడం, వ్యవసాయ అధికారులు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించకపోవడంతో ఎక్కువగా వరి పంట సాగు చేశారు. కేవలం 2,314 ఎకరాల్లోనే వేరుశనగ, ఉల్లి, ఆముదం లాంటి ఆరుతడి పంటలు సాగు చేసినట్లు అధికారులు గుర్తించారు. యాసంగిలో నాటిన వరికి ఎర్ర తెగులు సోకి పంట పూర్తిగా ఎరుపు, పసుపు రంగులోకి మారడంతో పాటుగా ఎదుగుదల తగ్గింది. నెల రోజులు కావస్తున్న రెండు రోజుల క్రితం నాటిన పంటలా కనిపిస్తుంది. దీంతో రైతులు ఆందోళనకు గురువుతున్నారు.

వాతావరణ పరిస్థితుల ప్రభావంతో..

ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న ప్రభావంతో చలికి తెగుళ్ల ఎక్కువగా వరి పంటకు సోకి పెరగట్లేదు. పంట ఎరుపు, పసుపు రంగులోకి మారుతుంది. నివారణకు పంటను తరుచుగా ఆరబెడుతూ ఉండాలి. సూక్ష్మపోషకాల మిశ్రమం 500 గ్రాములు, 19–19–19, సిలామిన్ జింక్ 200 గ్రాముల మందులను 200 లీటర్ల నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా పిచికారీ చేసుకోవాలి. అలాగే వరి నాటి 15 నుంచి 20 రోజుల వ్యవధిలో ఉన్న పంటకు 30 నుంచి 40 కిలోల యూరియాతో పాటుగా కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 నుంచి 10 కిలోలు వేసుకోవాలి.

> **పంట వదిలేద్దాం అనిపిస్తుంది**
>
> 
>
> నేను ఎకరం పొలంలో 1010 రకం వరి పంట సాగు చేశాను. నాటి ఇప్పటికి 25 రోజులు కావస్తుంది. పంట మొత్తం ఎర్రబారి కుళ్లిపోతుంది. ఇప్పుడే నాటిన చేను లాగ కనిపిస్తుంది. వ్యవసాయ అధికారులు నీరు పెట్టకుండా ఆరబెట్టమన్నారు. అలాగే ఆరబెట్టి నీళ్లు పెడుతున్నా. పంట పూర్తిగా పాడైపోయింది. పెట్టుబడి రూ.18 వేల వరకు అయ్యింది. తెగులు పోకపోతే పంటను వదిలేద్దాం అనుకుంటున్నా.
>
> – అనెమోని నాగయ్య, అప్పారెడ్డిపల్లి

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మదనాపురం: మండల కేంద్రంలోని పాత జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో ఆదివారం 1986–87 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వపు విద్యార్థి అశోక్‌గౌడ్ తాత కీర్తిశేషులు సీతన్నగౌడ్ జ్ఞాపకార్థంగా పాఠశాల ఆవరణంలో స్టేజి నిర్మాణం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తరలివచ్చిన పూర్వపు విద్యార్థుల కుటుంబ సభ్యులతో ఒకరినొకరు గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఎనిమిది మంది గురువులను, ఎంపీపీ పద్మావతి, సర్పంచ్ రాంనారాయణను పూలమాల, శాలువాతో సన్మానించి, మెమెంటోలు అందజేశారు. క్యాక్రమంలో పూర్వపు విద్యార్థులు వాసురెడ్డి, చెన్నయ్య, మిషేక్, అశోక్‌కుమార్, శివకుమర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సిద్దయ్య

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో గల వైరాలగుట్టలో వెలిసిన శివాలయం ఆవరణంలో స్థానిక సర్పంచ్ సిద్దయ్య సొంత నిధులు రూ.1.50లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ మాలధారులు ఇరుముడి పూజలు చేసే సమయంలో వచ్చే భక్తులు కూర్చొవడానికి ఇబ్బంది లేకుండా సీసీ స్లాబ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధి సహకరించాలని శివ మాలధారులు కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడ్, యాదగిరి గౌడ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో అలసత్వం



అమరచింతలో నాలుగో వార్డులో ఏర్పాటు చేసిన క్రీడా మైదానం

> **త్వరలోనే పూర్తి చేస్తాం**
>
> 
>
> పట్టణంలోని పది వార్డుల్లో క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రస్తుతం స్థలాలు ఉన్న చోట కొన్నింటికి సంబంధించిన ఆట మైదానాలు ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు ఆయా వార్డుల్లో అక్కడి స్థల పరిస్థితులతో రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు క్రీడా ప్రాంగణాల కోసం ఖర్చు చేశాం.
>
> – మహమ్మద్ ఖాజా, మున్సిపల్ కమిషనర్

అమరచింత: మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో తెలంగాణ క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో పట్టణంలోని ఆయా వార్డుల్లో క్రీడా ప్రాంగణ పనులు మొదలయ్యాయి. పట్టణంలోని 1, 2, 3, 4, 5, 6, 7, 8 వార్డుల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు మున్సిపల్ పాలక వర్గం, అధికారులు శ్రీకారం చుట్టారు. జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో లాంగ్ జంప్ కోర్టు, బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలలో రింగ్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. 2వ వార్డులోని ఎస్సీ వసతి గృహంలో వాలీబాల్, కబడ్డీ కోర్టులను నిర్మించడానికి స్థలాన్ని చదును చేసి క్రీడా ప్రాంగణాల సూచిక బోర్డులనుయేర్పాటు చేశారు. కోర్టుల ఏర్పాటు వ్యవహారంలో కేవలం మొర్రం పోసి దానిని చదును చేయకుండా వదిలి వేయడంతో మొర్రం మట్టిలోని రాళ్లు కాళ్లకు కుచ్చుకుంటున్నాయని విద్యార్థులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తు సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించింది. కానీ ఆయా వార్డుల్లో స్థల కొరత కారణంగా వాలీబాల్, కబడ్డీ, రింగ్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. అసంపూర్తిగా క్రీడా ప్రాంగణాలు ఉండటంతో వాటిని విద్యార్థులు, యువకులు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల క్రీడా ప్రాంగణాల సూచిక బోర్డులను సైతం మరిచారు. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గేటు బయటి నుంచే పలకరింపులు



బుద్దారం గురుకుల పాఠశాల గేటు వద్ద తమ పిల్లల కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు

గోపాల్‌పేట: గురుకుల పాఠశాలలో చదువదుతున్న తమ పిల్లలను చూసి వారితో కాసేపు మాట్లాడదామని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లలను చూసేందుకు తల్లిదండ్రులు ప్రతి రెండో శనివారం, ఆదివారం వస్తుంటారు. వ్యయ ప్రయాసలకోర్చి దూరం నుంచి తమ పిల్లలను చూసేందుకు వస్తే కొన్నిసార్లు పాఠశాల గేటు మూసి ఉపాధ్యాయులు వారిని కలిసేందుకు అవకాశం కల్పించడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఏదైనా మాట్లాడాల్సి ఉన్నా బయటి నుంచే మాట్లాడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయం పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్యం ను వివరణ కోరగా.. ఎప్పుడైనా అవకాశం కల్పిస్తాం కానీ ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్ పరీక్షల కోసం విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారని.. ఇలాంటి సమయంలో తల్లిదండ్రులను అనుమతిస్తే వారి ఏకాగ్రత దెబ్బతింటుందన్న ఉద్దేశంతోనే వారిని ఆపుతున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని అర్థం చేసుకుని సహకరించాలని కోరారు.

పీహెచ్‌సీల్లోనే మెరుగైన వైద్యం



పాన్‌గల్: పీహెచ్‌సీల్లోనే మెరుగైన వైద్యంతో పాటు కాన్పులు సురక్షితమని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెంగళాయిపల్లికి చెందిన సుజాతకు సాధారణ ప్రసవంలో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. బాలింతకు కేసీఆర్ కిట్టు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెలల్లో ఇప్పటి వరకు రెండు కాన్పులు అయినట్లు డాక్టర్ పేర్కొన్నారు. గర్భిణులు పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకొని ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు సౌసిల్య, సిబ్బంది పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న చెన్నరాములు

ఖిల్లాఘనపురం: దేశంలో 56 శాతం ఉన్న ఉత్పత్తి కులాలు అయిన బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీఎస్పీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు నాగనమోని చెన్నరాములు అన్నారు. బీసీల రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వనపర్తి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మొల్గర తిరుమలేష్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతు దేశంలో ప్రతి రాజకీయ పార్టీ బీసీలను ఓట్ల కోసమే వాడుకుంటున్నారని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి దేశం వరకు ఏ పదవుల్లోనూ బీసీలు లేకుండా చూస్తున్నారని మండిపడ్డారు. జనాభా లెక్కన రిజర్వేషన్ ప్రకటించే వరకు బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు గట్టు మన్నెం, అసెంబ్లీ కార్యదర్శి కరుణాకర్, ఖిల్లాఘనపురం అధ్యక్షుడు గోపి ముదిరాజ్, ఉపాధ్యక్షులు రమేష్, మన్నెం పాల్గొన్నారు.

కనులపండువగా ఆదిదంపతుల కల్యాణం



కొత్తకోట: పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీ కోటిలింగేశ్వర ఆలయంలో ఆదివారం ఆదిదంపతులు శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు కనులపండువగా జరిపించారు. శివస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా శివస్వాముల పడిపూజ

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో శివస్వాములు ఆదివారం పడిపూజ, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అనంతరం శివస్వాములు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగినేని అభిలాష్‌రావు, శ్రీకృష్ణ, శివస్వాములు, రాముడు, శివయ్య, కర్రెన్న, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుకు రైతుల మొగ్గు



చంద్రకల్‌లో రైతు సాగు చేసిన ఆయిల్‌పాం తోట

- నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల్లో సాగు
- 2వేల ఎకరాల్లో సాగు కోసం కసరత్తు

పెద్దకొత్తపల్లి: రైతులు సాంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలికి వాణిజ్య పంటలైన ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఇప్పటి వరకు ఆయిల్‌పాం సాగు చేపట్టారు. ఈ పంట సాగు 30 ఏళ్ల వరకు రైతుకు ఆదాయం అందిస్తుంది. కొల్లాపూర్ నియోజకవర్గంలో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. అయితే గత 4 ఏళ్ల నుంచి మామిడి దిగుబడి తగ్గిపోవడంతో రైతులు మామిడి తోటల పెంపకానికి స్వస్తి పలికి ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పాం సాగు చేపట్టే రైతులకు సబ్సిడీపైన మొక్కలను డ్రిప్ అవకాశం కల్పించడంతో రైతులంతా ఈ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు కోడేరులో 400 ఎకరాలు, కొల్లాపూర్ 200 ఎకరాలు, పెద్దకొత్తపల్లి 200 ఎకరాలు, పెంట్లవెల్లి మండలంలో 200 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలను నాటారు. నియోజకవర్గంలో ఉన్న భూములన్నీ ఆయిల్‌పాం పంటకు అనుకూలంగా ఉండడంతో సాగు చేసేందుకు రైతులంతా ముందుకొస్తున్నారు. పంటను ఏర్పాటు చేసే రైతులంతా కొత్తగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి పంట సాగు కోసం రైతులకు అనుమతులను ఇస్తున్నారు. మరో రెండు వేల ఎకరాల్లో సాగు చేసేందుకు ఉద్యానవన అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

> **6 ఎకరాల్లో మొక్కలు నాటాను**
>
> 
>
> మాకున్న 8 ఎకరాల పొలంలో ప్రస్తుతం 6 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటాను. ప్రభుత్వం సబ్సిడీపైన మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించింది.
>
> – పర్వతాలు రైతు, పెద్దకొత్తపల్లి

> **దరఖాస్తు చేసుకోవచ్చు**
>
> నియోజకవర్గంలో ఆయిల్‌పాం సాగుకు అనుకూలంగా ఉంది. నీటి వసతి ఉన్న రైతులంతా దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తులను ప్రభుత్వానికి పంపించి రైతులకు ఆయిల్‌పాం మంజూరయిన వెంటనే మొక్కలు, డ్రిప్ సౌకర్యం కల్పిస్తాం.
>
> – లక్ష్మణ్, ఉద్యానవన అధికారి కొల్లాపూర్

వైభవం..రథోత్సవం



వేంకటేశ్వరస్వామి తేరు లాగుతున్న యువకులు

- కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు
- పెద్దసంఖ్యలో పాల్గొన్న ప్రజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



కోలాటం వేస్తున్న కళాకారులు



స్వామివారి పల్లకీ ఊరేగింపు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా వేంకటేశ్వరస్వామి అలివేల మంగసమేత విగ్రహాలను పల్లకీలో మోస్తూ డోలు, డప్పులతో నాట్యం వేస్తూ కోలాటాలతో స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధి కోసం ఆలయ సమీపంలో ఏసీడీసీ నిధుల నుంచి రూ.20లక్షల వ్యయంతో మినీ కల్యాణ మండపానికి భూమిపూజ చేశారు. అంతేకాకుండ ఆలయ అభివృద్ధి కోసం రూ.50 లక్షల ప్రతిపాదనలు పంపినట్లుగా తెలియజేశారు. యువకులు ఓం నమో వెంకటేశ్వరాయ.. గోవిందా.. గోవిందా అంటూ స్వామివారి రథోత్సవాన్ని ఉత్సాహంగా లాగారు.

ప్రత్యేక బందోబస్తు

రథోత్సవం సందర్భంగా సీఐ యాలాద్రి, ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పెద్ద ఎత్తున సిబ్బందితో రథోత్సవాన్ని ముందుకు సాగించారు.

హాజరైన రాజకీయ నాయకులు..

రథోత్సవానికి కొల్లాపూర్ నియోజకవర్గ రాజకీయ నాయకులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు అభిలాష్‌రావు, బీజేపీ నాయకులు ఏలేని సుధాకర్‌రావు, ఆలయ ట్రస్ట్ చైర్మన్ జీవన్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ సువర్ణ, మాజీ సర్పంచ్‌లు రాజేష్, సురేందర్‌గౌడ్, కోట్ల సురేందర్‌గౌడ్, ఎంపీటీసీ సుమలతశేషు, శేషు, రమణ, కోఆప్షన్ మెంబర్ మతీన్, విజయరామారావు, ఎస్‌కె ఖాజా, పోతుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీనివాసుడి కల్యాణోత్సవం

కోడేరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ తెలిపారు. సోమవారం భక్తి గీతాపాలన, అనమాచార్య సంకీర్తనలు, మంగళవారం సత్యనారాయణస్వామి వ్రతం, పల్లకీసేవ, మంగళహారతి, రథోత్సవం, నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.